సాక్షి ప్రకాశం

శుక్రవారం । 9 । మే । 2025



డిమాండ్ ఉన్నా ధర దక్కనివ్వడం లేదు

మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఉన్నా వ్యాపారులు ధర దక్కనివ్వడం లేదని కలెక్టర్ ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. -10లో..



కక్ష సాధింపులు ఇంకెన్నాళ్లు?

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, అరాచకాలకు పాల్పడుతోందని దర్శి ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి విమర్శించారు. -10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

మీ కోసం 13వ తేదీకి మార్పు

ఒంగోలు సబర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 12న జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని 13వ తేదీకి మార్పు చేశారు. ఈ నెల 12న సోమవారం డీఆర్‌సీ సమావేశం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన డీఆర్‌సి సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. 12వ తేదీ డీఆర్‌సీ నేపథ్యంలో మీకోసం కార్యక్రమాన్ని 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె



దీక్షా శిబిరంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ప్రదర్శన చేస్తున్న సీహెచ్‌ఓలు

ఒంగోలు టౌన్: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్ స్పష్టం చేశారు. సమ్మె చేపట్టి 10 రోజులైనా స్పందించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. విలేజీ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను నిబంధనల మేరకు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన గురువారం 10వ రోజుకు చేరింది.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ...సీహెచ్‌ఓల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం బాధాకరమన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, హైక్‌ను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ ఇన్సెంటివ్‌లను విడుదల చేయాలని, ఈపీఎఫ్ బెనిఫిట్‌ను పునరుద్ధరించాలని, ఎక్స్‌గ్రేషియో పాలసీని అమలు చేయాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షా శిబిరంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని 538 మంది సీహెచ్‌ఓలతో పాటుగా రాష్ట్ర , జిల్లా నాయకులు శ్రీకాంత్, ప్రసన్న, జీవనజ్యోతి, జయశ్రీ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలాన్ని పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ



బేళ్లను పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

కనిగిరిరూరల్: కనిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వేలం జరుగుతున్న ప్రక్రియను, పొగాకు ధరలు, బేళ్ల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పొగాకు రైతులతో మాట్లాడారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిలో అమ్మకానికి తగిన పొగాకును తీసుకుని రావాలని రైతులను కోరారు. కంపెనీల ప్రతినిధులు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అనంతరం బోర్డు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత మార్కెట్ ధరలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.వేణుగోపాల్, బి. కోటేశ్వరరావు, వేలం నిర్వాహణ అధికారి, రైతు నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి షికారు..!

డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి అవినీతి జబ్బు చేసింది. జిల్లా వాసులకు మెరుగైన వైద్యసేవలందించే విషయంలో కీలక భూమిక పోషించే వైద్య ఆరోగ్యశాఖ పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది. నర్సింగ్ పదోన్నతులు మొదలు డిప్యుటేషన్ల వరకూ పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. జేసీ నిర్వహించాల్సిన విచారణ వాయిదాలు పడుతుండడం గమనార్హం.

- వరుసగా అవినీతి ఆరోపణలు
- తీరు మార్చుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- నిబంధనలకు వ్యతిరేకంగా తిష్టవేసి చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- ప్రైవేటు కారుకు ప్రభుత్వ డ్రైవర్



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎన్ని అవినీతి ఆరోపణలు వస్తున్నా జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ పనితీరు మారడం లేదు. ఒక అవినీతి మరచిపోక ముందే మరో అవినీతి ఆరోపణలు వచ్చిపడుతున్నాయి. నర్సింగ్ సిబ్బంది పదోన్నతుల సమయంలో ఫోన్ పే ద్వారా మామూళ్లు వసూలు చేయడం సంచలనం సృష్టించింది. అది మరచిపోకుండానే ముఖ హాజరు విషయంలో ట్యాంపరింగ్ కలకలాన్ని సృష్టించింది. తాజాగా నిబంధనలకు వ్యతిరేకంగా ఓ అధికారి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తిష్టవేసి వసూళ్లకు పాల్పడం చర్చనీయాంశమైంది.

ఆ మెడికల్ ఆఫీసర్‌కు ఇక్కడేం పని...

జిల్లా కేంద్రానికి సమీప మండలంలోని ప్రాథమిక వైద్యశాలలో పనిచేస్తున్న ఒక మెడికల్ ఆఫీసర్ గత ఏడాది జూన్ 31వ తేదీ నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఓ విభాగానికి ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలను పూర్తిస్థాయిలో తీసుకొని పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఏడాది జనవరి 31వ తేదీన ఆయన స్థానంలో వేరే అధికారి బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. అప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన సదరు మెడికల్ ఆఫీసర్‌ను పూర్వ స్థానానికి వెళ్లిపోవాలని స్వయంగా డీఎంహెచ్‌ఓలు వెంకటేశ్వర్లు ఆదేశించినట్లు సమాచారం. ఏం జరిగిందో తెలియదు కానీ ఆయన మాత్రం విధుల్లో చేరలేదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోనే తిష్టవేసినట్లు సమాచారం. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో అనధికారికంగా విధులు నిర్వహించిన ఆయన అక్రమంగా వసూళ్లకు తెరదీసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓ అధికారికి చెందిన కారు డ్రైవర్‌తో కలిసి ప్రైవేటు వైద్యశాలల రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసినట్లు సమాచారం. ఒక్కో వైద్యశాల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో ఇప్పటికే కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అంతేకాకుండా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు విచారణ ఆదేశించినట్లు సమాచారం. ఇందుకు సాక్ష్యంగా వారు సదరు ఆఫీసర్ హయాంలో జరిగిన ప్రైవేట్ వైద్యశాలల రెన్యువల్స్‌ను ప్రస్తావిస్తున్నారు. ఆయన హయాంలో జరిగిన ప్రైవేట్ వైద్యశాలల రెన్యువల్స్‌ను పరిశీలిస్తే సీసీ కెమెరాలలో వాస్తవాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు. అంతేకాకుండా సదరు మెడికల్ ఆఫీసర్ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎఫ్ఆర్ఎస్ వేసినట్లు తెలుస్తుంది.

అక్రమంగా డిప్యుటేషన్లు...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అక్రమంగా డిప్యుటేషన్లు వేసినట్లు తెలుస్తుంది. ఒక్కొక్కరి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లాలోని అనుమలవీడు పీహెచ్‌సీలో ఆఫీసు సబార్డినేటర్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగిని, ఈతముక్కలపాడు పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఏగా పనిచేస్తున్న ఉద్యోగిని, కొర్రపోలు పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న వారిని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డిప్యుటేషన్ వేశారు. పుల్లల చెరువు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వైద్యుడిని ఈతముక్కల పీహెచ్‌సీకి డిప్యూటేషన్ వేశారు. ఇవన్నీ అధికారికంగా డిప్యుటేషన్ వేసినట్లు సమాచారం. అలాగే కొత్తపట్నం పీహెచ్‌సీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, కొమరోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను సైతం డీఎంహెచ్‌ఓ కారాలయంలో అనధికారికంగా డిప్యూటేషన్ వేసినట్లు ఆరోపణలు వినిపిసున్నాయి.

ప్రైవేట్ కారుకు ప్రభుత్వ డ్రైవర్...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రైవేట్ కారు వ్యవహారంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఓ అధికారి పర్యటనల నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనాన్ని కేటాయించుకున్నారు. దీనికి ప్రైవేట్ డ్రైవర్‌ను ఉపయోగించుకొని అధికారిక పర్యటనలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఇద్దరు ప్రభుత్వ డ్రైవర్లను ఉపయోగించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కూడా ప్రజా సంఘాలు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రైవేట్ వాహనానికి ఎల్లో నెంబర్ ప్లేటు పెట్టుకోవాల్సి ఉంటుంది. కానీ వైట్ ప్లేటు పెట్టుకొని తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి నెల నెల బిల్లులు పెట్టుకుంటున్నట్లు సమాచారం.

వాయిదాల్లో విచారణ..

ఇప్పటికే నర్సింగ్ సిబ్బంది పదోన్నతుల విషయంలో ముడుపులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నర్సింగ్ స్టాఫ్ సీనియార్టీ లిస్టును మార్చినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కానీ ఇంత వరకు విచారణ జరగలేదు. తాజాగా మరిన్ని ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై విచారణ జరిగే అవకాశం ఉంటుందా లేదో తెలియడం లేదని ఫిర్యాదుదారులు చెబుతున్నారు.

పనులు పటిష్టంగా చేపట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు:

ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు పటిష్టంగా చేపట్టడంతో పాటు కూలీలకు కూలి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా డ్వామా అధికారులను ఆదేశించారు. మండలంలోని జయవరం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగునీటి కాలువ పూడికతీత పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు సకాలంలో నగదు ఖాతాల్లో జమవుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పన గురించి అడిగి తెలుసుకొని కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలి రాజమ్మ తనకు వితంతు పెన్షన్ రావడం లేదని కలెక్టర్‌కు చెప్పగా..వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టెను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో యల్లవరపు వెంకట సుబ్బారెడ్డి ఇంటిపై పీఎం సూర్యఘర్ పథకం కింద ఏర్పాటుచేసిన సోలార్ ప్యానెల్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ దేవసేవకుమారి, సర్పంచ్ పేరమ్మ, విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు, ఏపీఓ మాచర్ల, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరంపై అక్కసా సిగ్గు.. సిగ్గు

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియాపై కూటమి ప్రభుత్వం బరి తెగింపు ప్రదర్శిస్తోంది. లక్షల మెదళ్లను కదిలించే అక్షరాలను చిదిమివేయాలని చూస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రచురించే పత్రికా స్వేచ్ఛను హరించాలని ప్రయత్నిస్తోంది. 'సాక్షి'పత్రిక ఎడిటర్ ఇంట్లోకి ఖాకీలు చట్టవ్యతిరేకంగా చొరబడి సోదాలు చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులు గర్హిస్తున్నారు. విశృంఖల దాష్టీకాలకు పాల్పడిన బ్రిటిష్ పాలకులనే తరిమికొట్టిన అక్షరాలను చెరిపి వేయాలనుకుంటే.. చరిత్ర గర్భంలో కలిసిపోవడం ఖాయమని జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, సామాన్య ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ఉక్కు పాదమా?
- సాక్షి పత్రిక ఎడిటర్ నివాసంలో అక్రమ సోదాలు
- ఖండించిన జర్నలిస్టుల సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు
- ఒంగోలులో నల్లబ్యాడ్జిలతో భారీ ర్యాలీ
- మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, కంభంలలో జర్నలిస్టు సంఘాల నిరసన ప్రదర్శనలు
- ప్రజాస్వామ్యం ఖూనీ చేశారని ఏపీయూడబ్ల్యూజే ఖండన



ఒంగోలు: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సాక్షి బ్యూరో ఇన్‌చార్జి మాధవరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నాయకుడు సురేష్ తదితరులు

ఒంగోలు టౌన్: పత్రికా చరిత్రలో ఇదోక బ్లాక్ డే.. కనివినీ ఎరుగని విధంగా ఒక పత్రికా సంపాదకుడిపై పోలీసులు దాడి చేయడాన్ని యావత్ జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు తీవ్ర స్వరంతో ఖండించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి నివాసంలోకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే చొరబడిన పోలీసులు గంటల తరబడి వేధింపులకు దిగడం పట్ల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కంభం తదితర ప్రాంతాల్లో జర్నలిస్టులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. ఎక్కడికక్కడ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వివిధ జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టులు భారీ ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన జర్నలిస్టులు నగరంలోని సాక్షి సీటీ కార్యాలయం నుంచి కోర్టు సెంటర్, రాజాపానగల్ రోడ్డు, వీఐపీ రోడ్డు మీదుగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసు కార్యాలయం ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరిన జర్నలిస్టులు కలెక్టరేట్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. చౌరస్తాలో నిరసన చేపట్టిన జర్నలిస్టులు..రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి చర్చి సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ చినోబులేసుకు వినతి పత్రం అందజేశారు.

పత్రికా స్వేచ్ఛపై దాడులు సమర్థనీయం కాదు...

సాక్షి ఎడిటర్ ఇంటిపై పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి గంటల తరబడి ఇబ్బందులకు గురిచేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. సురేష్ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత దుర్మార్గమైన ఘటనగా అభివర్ణించారు. దేశంలో ఒకవైపు ఉగ్ర దాడుల తరువాత యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో మరేమి పనిలేదన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మూడు రోజుల క్రితం నెల్లూరు జిల్లా కావలిలో ముగ్గురు జర్నలిస్టులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం పత్రికల గొంతునొక్కడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియాపై దాడులకు పురిగొల్పడం అభ్యంతరకరం. గతంలో మండల విలేకరులు, జిల్లా స్థాయి విలేకరులపై ఏవో చిన్న చిన్న ఘటనలు జరిగేవని, ఇప్పుడు ఏకంగా ప్రముఖ పత్రికా ఎడిటర్ మీదనే దాడికి పాల్పడడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులను విరమించుకోకపోతే జర్నలిస్టులంతా రోడ్డు మీదకు వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తూ పోలీసులతో సాక్షి ప్రతికా ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై దాడికి పాల్పడడం ఎమర్జెన్సీని తలపిస్తుందని సీనియర్ జర్నలిస్టు జనార్దన్ విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వం పత్రికలను స్వాధీనం చేసుకున్న విధంగానే ప్రస్తుత కూటమి పాలకుల తీరు ఉందన్నారు. పాలకులు, ప్రతిపక్షాలు ఎవరి పోరాటాలు వారికుంటాయని, పత్రికల ప్రజాస్వామిక హక్కుల మీద దాడికి దిగడం దుర్మార్గమన్నారు.

పాత్రికేయులను భయపెట్టేందుకే...

సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటో పోలీసులు దౌర్జన్యంగా తనిఖీలు నిర్వహించడం పాత్రికేయులను భయాందోళనకు గురి చేయడమేనని ఏపీయూడబ్ల్యూజే ప్రకాశం జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో ఖండించింది. ఒక ప్రముఖ పత్రికా సంపాదకుడి ఇంట్లో సోదాలు నిర్వహించాలని అనుకుంటే ముందుగా నోటీసులు ఇచ్చి ఉండాల్సిందని, అందుకు విరుద్ధంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పెద్ద సంఖ్యలో పోలీసులు ఇంటిలోకి చొరబడిన తీరు గర్హనీయమని పేర్కొన్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం.

సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే లక్ష్యంతోనే దాడి చేసినట్లు భావిస్తున్నాం. పత్రికా ఎడిటర్ అన్న గౌరవం కూడా లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా పోలీసులు మాకుమ్మడిగా ఇంట్లోకి చొరబడి తనిఖీలు చేయడం గర్హనీయం. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి విధానాలు కొనసాగిస్తే ప్రజాస్వామ్యవాదులంతా ఎదుర్కొంటారు.

– ఐవీ సుబ్బారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు



ఎస్పీ దామోదర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు



మార్కాపురంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



కంభంలో సీఐకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



యర్రగొండపాలెం రెవెన్యూ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

- చర్చనీయంగా మారిన పోలీసుల రాత్రి తనిఖీలు
- పోలీసు పహారా మధ్య వీరయ్య చౌదరి పెద్దకర్మ
- వీరయ్య హత్య కేసు రెండు రోజుల్లో ముగింపు
- ఎస్పీ, డీఎస్పీ, సీఐలు పెద్ద ఎత్తున తనిఖీలు
- ఇప్పటికే పూర్తి సమాచారాన్ని సేకరించిన పోలీసు విచారణ బృందం

అర్ధరాత్రి నగరాన్ని జల్లెడ..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

దారుణ హత్యకు గురైన టీడీపీ నేత వీరయ్య చౌదరి పెద్ద కర్మ జరిగిన రోజు రాత్రి ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో నగరంలో పోలీసులు పెద్ద ఎత్తున తనీఖీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారులపై వెళుతున్న కార్లు, ఆటోలు, మోటారు బైకులను తనిఖీలు చేశారు. నగరంలోని లాడ్జీలు, రెస్టారెంట్లలో అణువణువు గాలింపులు చేపట్టారు. స్క్వాడ్ డాగ్‌లను రంగంలోకి దించారు. ఈ తనిఖీలకు వీరయ్య హత్య కేసుకూ ఏమైనా లింకులు ఉన్నాయ్యా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల తనిఖీలు సహజంగా జరిగిదే కదా అంటే ఎస్పీ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు నుంచి సీఐలు, ఎస్ఐలు అంతా తనిఖీలలో పాల్గొనడం విశేషం. ఏదో జరగబోతుందా అన్న సందేహాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు పహారా మధ్య వీరయ్య చౌదరి పెద్దకర్మ

గురువారం అమ్మనబ్రోలు గ్రామంలో వీరయ్య చౌదరి పెద్ద కర్మ పోలీసు పహారా మధ్య జరిగింది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 150 మంది పోలీసులు, రూరల్ సీఐ, ముగ్గురు ఎస్సైలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసులు నిఘా పెట్టారు. వీరయ్య చౌదరి ఇంటి వద్ద నిర్వహించిన పెద్ద కర్మకు టీడీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు హాజరయ్యారు.

కేసు విచారణ కీలక దశకు వచ్చినట్టేనా..?

వీరయ్య చౌదరి హత్య జరిగిన నేటికి 18 రోజులైంది. హత్యకు సంబంధించి పోలీసుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే వీరయ్య హత్య కేసులో సూత్రధారులను, పాత్రధారులను దాదాపుగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్య కేసులో ప్రధాన పాత్రధారుడిగా అనుమానిస్తున్న అమ్మనబ్రోలుకే చెందిన హవాలా వ్యాపారి మాత్రం ఇంకా పోలీసులకు చిక్కలేదని సమాచారం. రేపో మాపో కేసును ఫైనల్ చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

మరికొంత మంది పోలీసులపై చర్యలు?

వీరయ్య హత్య తాలుకా పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగిన విషయం తెలిసిందే. హత్యకు ముందు నిందితులు వీరయ్య కార్యాలయం వద్ద రోజుల తరబడి రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. అంతేకాకుండా తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గుంటూరు రోడ్డులోని ఒక లాడ్జిలో నిందితులు కొద్ది రోజుల పాటు ఉన్నట్లు తెలుస్తోంది. హత్య చేసిన తరువాత కూడా తాలుకాపోలీసు స్టేషన్ మీద నుంచే హంతకులు పరారయ్యారు. అంటే హత్యకు ముందు, హత్య తరువాత కూడా పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో తొలివేటు తాలుకా సీఐ అజయ్ కుమార్ మీద వేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా వీరయ్య హత్య కేసును ముందుగా పసికట్టలేకపోయిన మరింత మంది పోలీసులను బాధ్యులుగా నిర్ణయించినట్లు సమాచారం. వారి మీద కూడా చర్యలు తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



నగరంలో రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ

కక్ష సాధింపులు ఇంకెన్నాళ్లు?

- కేసులు పెడితే బెదిరేది లేదు
- కార్యకర్తలే వైఎస్సార్‌ సీపీ బలం
- సూపర్‌ 6 హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆత్మహత్యలు సర్కారుకు సిగ్గుచేటు
- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దొనకొండ: సంక్షేమ పథకాలు అందించి మేలు చేస్తారని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, అరాచకాలకు పాల్పడుతోందని దర్శి ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి విమర్శించారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌ సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించడం మానుకోవాలని హితవు పలికారు. దొనకొండ మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సందర్భంగా బుధవారం రాత్రి వైఎస్సార్‌ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్‌ ప్రభపై జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే కూటమి ప్రభుత్వం మాత్రం అక్రమ కేసులు బనాయించడంపైనే శ్రద్ధ చూపుతోందని ఎద్దేవా చేశారు. బడుగు బలహీనవర్గాలకు, రైతులకు, మహిళలకు అని రకాలుగా సంక్షేమాన్ని అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. గతంలో పొగాకు, మిర్చి, కంది, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత మాట దాటవేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మరోమారు తేటతెల్లమైందన్నారు. సూపర్‌ 6 హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. చంద్రబాబునాయుడుతోపాటే రాష్ట్రంలోకి కరువు వచ్చిందని, అరకొరగా పండిన పంటను సైతం అమ్ముకోలేక రైతులు విలవిల్లాడుతున్నారన్నారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలే వైఎస్సార్‌ సీపీకి కొండంత బలమని, కేసులు పెట్టినా బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఈ నెలాఖరులో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించి రైతులతో మాట్లాడతారని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ కాకర్ల కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్‌ బాపనపల్లి శ్రీను, దర్శి నియోజకవర్గ బూత్‌ కమిటీ అధ్యక్షుడు కాలూరి రమణయ్య, జిల్లా యూత్‌ విభాగం అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్‌ జాయింట్‌ సెక్రటరీ గుంటు పోలయ్య, దర్శి నియోజకవర్గ వలంటీర్‌ వింగ్‌ అధ్యక్షుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా యాక్టివ్‌ మెంబర్‌ బత్తుల వెంకటసుబ్బయ్య, బీమిని వెంకటేశ్వర్లు, గొంగటి మహేష్‌రెడ్డి, కన్నెధార వెంకటసుబ్బయ్య, ఐలూరి శ్రీనివాసరెడ్డి, కసిబిసి నాగరాజు, తమ్మనేని సుబ్బారెడ్డి, ఇండ్ల శ్రీనివాసరావు, పులిమి శివ, కె.ప్రసాద్‌, ఆరవల్లిపాడు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ అదుపు తప్పి ఆర్టీసీ ఉద్యోగి మృతి


తీవ్రంగా గాయపడిన మహబూబ్‌ బాషా

ముండ్లమూరు(కురిచేడు): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వేంపాడు గ్రామం వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. ఒంగోలుకు చెందిన షేక్‌ మహబూబ్‌ బాషా(60) చీమకుర్తిలో నివాసముంటూ ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడటంతో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మహబూబ్‌ బాషా మృతి చెందినట్లు 108 సిబ్బంది తెలిపారు.

తేనెటీగల దాడిలో ఏడుగురికి గాయాలు

హనుమంతునిపాడు: జామాయిల్‌ కోతకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హనుమంతునిపాడు మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కొండారెడ్డిపల్లి, కోటతిప్పల గ్రామాలకు చెందిన కూలీలు జామాయిల్‌ కర్ర కోతకు వెళ్లారు. ఈ క్రమంలో తోట గట్టు వెంట ముళ్ల పొదను జేసీబీతో తొలగిస్తుండగా అందులో ఉన్న తేనె తుట్టె కదిలింది. దీంతో తేనెటీగలు ఒక్కసారిగా కూలీలను చుట్టుముట్టాయి. గాయం శివారెడ్డి, సీహెచ్‌ దశరథ, నర్సయ్య, వెంకటలక్ష్మిలతోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఖేల్‌ ఇండియా బీచ్‌ గేమ్స్‌కు కొండరాజు



కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కసిబిసి కొండరాజు ఖేల్‌ ఇండియా బీచ్‌ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఎంపీడీ చదువుతున్న కొండరాజు ఈనెల 6వ తేదీన శాప్‌ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బీచ్‌ సెపక్‌తక్రా పోటీల్లో ప్రకాశం జట్టు తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు గుజరాత్‌ రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేల్‌ ఇండియా బీచ్‌ గేమ్స్‌ 2025లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు కొండరాజుకు అవకాశం దక్కిందని కోచ్‌ ఎం.ప్రసాద్‌ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

రిటైర్డ్‌ ఎస్సై శిలార్‌ బాషా మృతి


శిలార్‌ బాషా(ఫైల్‌)

కంభం: పట్టణానికి చెందిన రిటైర్డ్‌ ఎస్సై, బిలాల్‌ మసీదు గౌరవాధ్యక్షుడు షేక్‌ శిలార్‌ బాషా(70) గురువారం ఉదయం మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారని బంధువులు తెలిపారు. శిలార్‌బాషా మృతికి పలువురు సంతాపం తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన

- మాటల మాంత్రికుడిలా సీఎం చంద్రబాబు తీరు
- పేదలను మద్యానికి బానిసలు చేయడం నీచం
- ఏడాది పాలనలో ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పాలి
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ ధ్వజం


విద్యుత్‌ ప్రభపై మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్‌

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాన్య ప్రజలు, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ అరాచక పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ ధ్వజమెత్తారు. పొన్నలూరు మండలంలోని మాలపాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్‌ ప్రభపై ఆదిమూలపు సురేష్‌ మాట్లాడారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఎప్పటికప్పుడు మాటలు మారుస్తూ మాటల మాంత్రికుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచే ప్రతి విషయంలో అవినీతికి పాల్పడుతూ దర్జాగా ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. తొలి నుంచి యూటర్న్‌ బాబుగా పేరుపొందిన చంద్రబాబు ఏడాదిగా రాష్ట్ర ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. గ్రామానికి రెండు నుంచి మూడు బెల్ట్‌ షాపులు ఏర్పాటు చేసి అమాయక పేద ప్రజలను మద్యానికి బానిసలుగా తయారు చేయడం నీచమన్నారు. చంద్రబాబు చేస్తున్న అరాచక పాలనను ప్రజలు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు, మేధావులు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పకుండా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే జగనన్నని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్‌ రెడ్డి, పిల్లి తిరుపతి రెడ్డి, సర్పంచ్‌ అనుమోలు ప్రసాద్‌, నవులూరి మధు, కొండపి, జరుగుమల్లి మండలాల కన్వీనర్లు బచ్చల కోటేశ్వరరావు, పిన్నికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్‌ ఉన్నా ధర దక్కనివ్వడం లేదు

- కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా ఎదుట పొగాకు రైతుల ఆవేదన
- త్రోవగుంట పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్‌
- గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని బోర్డు అధికారులకు సూచన


పొగాకు వేలం తీరును పరిశీలిస్తున్న కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా, ఆర్‌ఎం తదితరులు

ఒంగోలు సబర్బన్‌: మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్‌ ఉన్నప్పటికీ వ్యాపారులు ధర దక్కనివ్వడం లేదని కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదికంటే ఈ సంవత్సరం భూముల కౌలు, కూలీ రేట్లు పెరిగాయని, గిట్టుబాటు ధర లేకపోవడంతో సంక్షోభంలో చిక్కుకున్నామని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. పొగాకుకు మంచి డిమాండ్‌ ఉన్నప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయకుండా వేలానికి తెచ్చిన బేళ్లను నోబిడ్‌, కంపెనీ రిజెక్ట్‌ పేరుతో వెనక్కి పంపిస్తున్నారని గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం ఒంగోలు నగర పరిధిలోని త్రోవగుంట వద్ద కొనుగోలు కేంద్రంలో పొగాకు వేలం తీరును కలెక్టర్‌ పరిశీలించారు. టుబాకో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావుతోపాటు వేలం నిర్వహణ అధికారులతో మాట్లాడి కొనుగోళ్లు, ధర తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. పొగాకు సాగు, దిగుబడి, వేలం కేంద్రంలో ఇబ్బందులపై ప్రశ్నించగా వారు తమ ఇబ్బందులను వివరించారు. గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్‌ స్పందిస్తూ.. పొగాకు ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా పొగాకు కొనుగోలు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ వెంట పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, ఒంగోలు రూరల్‌ తహసీల్దార్‌ వాసు తదితరులు పాల్గొన్నారు.

1.5 కేజీల గంజాయి పట్టివేత

- నలుగురు నిందితులు అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన కనిగిరి డీఎస్పీ


విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌ యశ్వంత్‌

కనిగిరి రూరల్‌: నిషేధిత మత్తు పదార్థం గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్‌ యశ్వంత్‌ పేర్కొన్నారు. కనిగిరి పోలీస్‌ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఎస్పీ ఉత్తర్వు మేరకు ఈ నెల 5న కనిగిరిలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించిన సమయంలో అక్రమంగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు గుర్తించామన్నారు. మంచినీటి దొరువు వద్ద గల బ్రహ్మంగారి గుడి దగ్గర మంగలిమాన్యానికి చెందిన నాగులూరి నరసింహ, నాగులూరి రాజేశ్వరి, దొరువు బజార్‌కు చెందిన కట్టా దుర్గ, పాతూరుకు చెందిన నాగులూరి దుర్గాప్రసాద్‌ అనే వ్యక్తులు నాగులూరి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు అంకబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్ల రూపంలోకి మార్చి కనిగిరిలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. బ్రహ్మంగారి గుడి వద్ద బుధవారం సుమారు 1.5 కేజీల గంజాయిని ప్యాకెట్లుగా మారుస్తున్న క్రమంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న వెంకటేశ్వర్లు, అంకబాబు కోసం గాలిస్తున్నామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌ విధించి ఒంగోలు, దరిశి జైలుకు పంపారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు అధికారి కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి, కనిగిరి, హెచ్‌ఎంపాడు ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.